సాక్షి
అనంతపురం
గురువారం । 4 । జనవరి । 2024



భోజనం.. రుచికరం

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన మెనూతో రుచికరమైన భోజనం అందిస్తున్నారు. 8లో



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం
31.8°/ 18.9°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత కొనసాగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

బడుగులకు జగన్ పెద్దపీట

- అభ్యర్థుల గెలుపునకు సహకరించాలి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు జిల్లా అధ్యక్షుడు పైలా పిలుపు



అనంతపురం కార్పొరేషన్: సామాజిక సమీకరణల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బడుగులకు పెద్దపీట వేశారని, అభ్యర్థుల గెలుపు కోసం శ్రేణులు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ స్థానాలను మళ్లీ బీసీలకు కేటాయించేలా అధినేత చర్యలు తీసుకున్నారన్నారు. అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్తగా పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్తగా జోలదరాశి శాంత, కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఎంపీ తలారి రంగయ్య, పెనుకొండ అసెంబ్లీ సమన్వయకర్తగా ఉష శ్రీచరణ్, కదిరి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా మక్బూల్ అహ్మద్‌ను నియమించి మరోసారి బడుగులకు ప్రాధాన్యత కల్పించారన్నారు.

కౌంటింగ్‌కు అనుకూలంగా ఉండాలి



కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుపై కలెక్టర్ గౌతమికి వివరిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో బ్యాలెట్ పెట్టెలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు గదులు అనుకూలంగా ఉండాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. జేఎన్‌టీయూ కళాశాలను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్, నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, రిసెప్షన్ కేంద్రం ఏర్పాటు గురించి కలెక్టర్‌కు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు అనుకూలంగా ఉండే గదులను ఎంపిక చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, నగర పాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుళరెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు, ఎన్నికల సెల్ తహసీల్దార్ భాస్కర్, తహసీల్దారు బాలకిషన్, డీటీ కనకరాజు, సర్వేయర్ ప్రతాపరెడ్డి ఉన్నారు.

వేరుశనగ వ్యాపారి పరారీ

- రైతులకు రూ.కోటికి పైగా బకాయిలు



ఆందోళన చేపట్టిన రైతులు

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన హుస్సేన్ అనే వేరుశనగ వ్యాపారి పరారయ్యారు. రూ.కోటి వరకు డబ్బు ఇవ్వకుండా వ్యాపారి అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో రైతులు బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. హుస్సేన్ ఇటీవల కంబదూరు, బ్రహ్మసముద్రం, బెళుగుప్ప మండలాల్లో రైతుల వద్ద నుంచి వేరుశనగ కొనుగోలు చేశాడు. డబ్బు చెల్లించడానికి పది రోజుల సమయం తీసుకున్నాడు. రెండు నెలలు కావస్తున్నా నగదు ఇవ్వకపోవడం, సెల్‌ఫోన్ పనిచేయకుండాపోవడంతో రైతులు ఏమి చేయాలో దిక్కుతోచలేదు. పరారీలో ఉన్న వ్యాపారిని పట్టుకొచ్చి, తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయం చేస్తామని సీఐ హరినాథ్ రైతులకు హామీ ఇచ్చారు.

అధికారి మాల్ ప్రాక్టీస్

తాడిపత్రి: డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాల్ ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడ్డాడు. వివరాలు... పదోన్నతులు పొందే క్రమంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం తరచూ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు నిర్వహిస్తుండడం తెలిసిందే. ఈ క్రమంలో రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే క్రమంలో బుధవారం తాడిపత్రి రూరల్ పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంగా డిపార్ట్‌మెంటల్ పరీక్షలు జరిగాయి. పరీక్ష రాసేందుకు వచ్చిన ఆర్‌ఐ స్థాయి ఉద్యోగి ఒకరు ఇన్విజిలేటర్ల కన్నుకప్పి తన వెంటసెల్‌ఫోన్ తీసుకెళ్లారు. అనంతరం ప్రశ్నలను బయటకు తెలిసిన వారికి చేరవేసి, అక్కడి నుంచి వచ్చే సమాధానాలను సెల్‌ఫోన్‌లో చూసుకుంటూ రాస్తుండగా ఇన్విజిలేటర్ గుర్తించి అడ్డుకున్నారు. ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ ఆర్‌ఐపై కేసు నమోదు చేశారు.

మూడువేల కాంతులు



అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో వైఎస్సార్ పెన్షన్ కానుక మెగా చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



అనంతపురం కృష్ణకళామందిరంలో జరిగిన పింఛన్ల పెంపు ఉత్సవంలో రాజేశ్వరి అనే లబ్ధిదారుకు పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, చిత్రంలో మేయర్ వసీం

- పెన్షన్ పెంపు ఉత్సవాలు ప్రారంభం
- రూ.3వేల పెన్షన్‌తో రెట్టించిన ఆనందం
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆశీస్సులు అందించిన పెద్దలు

అనంతపురం: వైఎస్సార్ పెన్షన్ కానుక అభాగ్యులకు ఆసరాగా నిలుస్తోంది. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా ఏపీలో మాత్రమే అధిక మొత్తంలో పింఛన్ అందుతోంది. కనీస అవసరాలు, ఆర్థిక ఇబ్బందులను గుర్తించి అవ్వాతాతలు, వితంతు, ఒంటరి మహిళ, చేతివృత్తిదారులకు ఏటా రూ.250 పెంచుతూ రూ.3వేల వరకు పింఛన్ తీసుకెళ్తానని సీఎం వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఆ మాటకు కట్టుబడి ఈ ఏడాది రూ.3వేల పింఛన్‌కు పెంచి నూతన సంవత్సర కానుకగా అందించారు. పెన్షన్ పెంపును పురస్కరించుకుని ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో పెన్షన్ పెంపు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. రూ.3వేల పెన్షన్‌తో తమకు గౌరవం మరింత పెరిగిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద కొడుకు స్థానంలో ఉండి తమ బాగోగులను పట్టించుకుంటూ పింఛన్ ద్వారా ఆదుకుంటున్న జగన్‌ను 'పెద్ద' మనసుతో ఆశీర్వదిస్తున్నారు.

- బుధవారం అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ గౌతమి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పింఛన్లు పంపిణీ చేశారు.
- అనంతపురంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో కృష్ణకళా మందిర్, సోమనాథ్ నగర్‌లోని రజక కమ్యూనిటీ హాల్‌లో పింఛన్ ఉత్సవాలు నిర్వహించారు. లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.
- గార్లదిన్నె మండలం బూదేడు సచివాలయం, శింగనమల మండల పరిషత్ కార్యాలయం, నార్పల మండలం కేశేపల్లి సచివాలయ ఆవరణలో నిర్వహించిన వైఎస్సార్ పెన్షన్ల పెంపు ఉత్సవంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు.
- తాడిపత్రి మండల పరిషత్ కార్యాలయం, పట్టణంలోని కమ్యూనిటీ హాలులో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పింఛన్ పెంపు ఉత్సవాల్లో పాల్గొని రూ.3వేల పింఛన్ పంపిణీ చేశారు.
- కళ్యాణదుర్గం పరిధిలో వైఎస్సార్ పింఛన్ పెంపు ఉత్సవాలు అన్ని మండలాల్లోనూ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు.
- రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా పింఛన్ల పెంపు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు.
- గుంతకల్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పింఛన్ పెంపు కార్యక్రమంలో ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేశారు.
- కూడేరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నూతన సంవత్సర కానుకగా రూ.3 వేల పింఛన్ అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని కలెక్టర్ గౌతమి తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలు, వితంతు, ఒంటరి మహిళ, చేతి వృత్తిదారుల పింఛన్‌ను నూతన సంవత్సర కానుకగా రూ.3వేలకు పెంచారన్నారు. పెన్షన్ పెంపు జిల్లాస్థాయి కార్యక్రమాన్ని బుధవారం అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తో పాటు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ పెన్షన్ కానుక కింద జిల్లా వ్యాప్తంగా 17 కేటగిరీలలో 2,93, 493 మందికి ప్రతి నెలా రూ.87.92 కోట్లు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. రూ.3వేల పింఛన్‌తో 2.31లక్షల మందికి మేలు చేకూరుతోందన్నారు.

ఇంటి వద్దకే పింఛన్ చరిత్రాత్మకం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ-వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకొచ్చారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కొనియాడారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా వలంటీర్ ద్వారా ఇంటి వద్దకే అదీ ఒకటే తేదీనే ఠంచన్‌గా పింఛన్ పంపిణీ చేయడం చరిత్రాత్మకమైనదిగా అభివర్ణించారు. రూ.3వేల పింఛన్‌తో పేదల జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో 90 వేల కుటుంబాలు ఉంటే అందులో 49 వేల మంది లబ్ధిదారులకు పింఛన్ అందుతోందన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ పాదయాత్ర, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. గత ప్రభుత్వాల్లో మాదిరిగా సిఫార్సులు, ఎదురుచూపులు లేకుండా అర్హత ఉంటే చాలు దరఖాస్తు చేసుకున్న వెంటనే పింఛన్ తదితర ఏ పథకాలైనా మంజూరవుతున్నాయన్నారు. అనంతరం 'పింఛన్ల పెంపు' లోగోను కలెక్టర్, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ ఆవిష్కరించి, పింఛన్‌దారులకు మెగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పాపంపేటలో నిర్వహించిన పెన్షన్ పెంపు జిల్లాస్థాయి కార్యక్రమానికి హాజరైన పింఛన్‌దారులు



అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో జరిగిన పింఛన్ పెంపు ఉత్సవంలో సీఎం జగన్ చల్లగా ఉండాలని మొక్కుతున్న వృద్ధురాలు

సంతోషంగా ఉంది



నా మనవడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వృద్ధాప్య పింఛన్ ఇంటి వద్దకే పంపుతున్నాడు. రేషన్‌ను కూడా ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారు. పింఛన్‌ను రూ.3 వేలకు పెంచడం చాలా సంతోషంగా ఉంది. గతంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయం వద్ద పెద్ద క్యూలైన్లో నిలబడాల్సి వచ్చేది. పింఛన్‌కు వెళ్లాలంటే భయమేసేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఈ ప్రభుత్వం కొండంత అండగా ఉంటూ ఆర్థిక ఉపశమనం కల్పించాడు.

– ఆనందమ్మ, పాపంపేట, అనంతపురం రూరల్ మండలం

కనిపించే దేవుడు జగన్



గతంలో పింఛన్ ఇచ్చే సమయానికి గ్రామంలో లేకపోతే చాలా ఆందోళన ఉండేది. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి నెలా వలంటీర్లు మా ఇంటికి వచ్చి పింఛన్ అందించడం ఎంతో సంతోషంగా ఉంది. కరోనా కష్ట కాలంలోనూ మాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పింఛన్ అందజేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. అధికారంలోకి రాగానే పింఛన్ రూ.2,250కి పెంచి, ఏటా పెంచుతూ ప్రస్తుతం రూ.3 వేలు ఇవ్వడం ఆనందంగా ఉంది. ఇంటి వద్దకే వచ్చి వైద్య పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి చిరకాలం చల్లగా ఉండాలని కోరుకుంటున్నారు. కనిపించే దేవుడు జగన్.

– ఎస్.లలితమ్మ, పాపంపేట, అనంతపురం రూరల్ మండలం






గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యేలు వై.వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, కూడేరులో సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

గవర్నర్ పర్యటన షెడ్యూల్ ఖరారు



ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం ఈ నెల ఆరో తేదీన నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్/యూనివర్సిటీల చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో గవర్నర్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది.

- ఆదివారం ఉదయం 7 గంటలకు బెంగళూరు నుంచి రోడ్డు మార్గం గుండా బయల్దేరుతారు.
- 8:30 గంటలకు శ్రీ సత్యసాయి జిల్లా సరిహద్దులోని కొడికొండ చెక్ పోస్టు వద్ద గల రక్షా అకాడమీకి చేరుకుంటారు.
- 8:30 నుంచి 8:50 గంటల వరకు అక్కడే ఉంటారు.
- 8:50 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి రోడ్డు మార్గం ద్వారా అనంతపురం జేఎన్‌టీయూకు 10:20 గంటలకు చేరుకుంటారు.
- 10:40 గంటలకు స్నాతకోత్సవంలో పాల్గొంటారు.
- మధ్యాహ్నం 12:45 గంటలకు అనంతపురం ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుని, అక్కడే భోజనం చేస్తారు.
- 2 గంటలకు బుక్కరాయసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలకు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర సభా వేదిక వద్దకు చేరుకుంటారు.
- సాయంత్రం 3:45 నిమిషాలకు అనంతపురం ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు.
- 4:30 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం బెంగళూరుకు రోడ్డు మార్గం ద్వారా వెళ్లనున్నారు.

జేఎన్‌టీయూలో పకడ్బందీ ఏర్పాట్లు

రాష్ట్ర గవర్నర్ షేక్ అబ్దుల్ నజీర్ ఈ నెల 6న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జేఎన్‌టీయూలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ గౌతమి బుధవారం పరిశీలించారు. ఆడిటోరియంలో జరిగే జేఎన్‌టీయూ స్నాతకోత్సవ కార్యక్రమాల్లో గవర్నర్ పాల్గొంటారన్నారు. అక్కడ ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ప్రొటోకాల్ విషయంలో విమర్శలకు తావు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. జేఎన్‌టీయూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. ఆడిటోరియంలో సీటింగ్ ఏర్పాట్లు, వచ్చిన వారందరికీ తాగునీటి వసతి, భోజనాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అతిథి గృహాలను సైతం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ వెంట ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, శ్రీనివాసులరెడ్డి, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, రిజిస్ట్రార్ శశిధర్, తహసీల్దార్ బాలకిషన్ తదితరులు ఉన్నారు.

ఉపాధిలో రికార్డు

- 'అనంత'లో డిసెంబరు నాటికి 93 లక్షల పని దినాలు
- శ్రీసత్యసాయి జిల్లాలో 65 లక్షలకు పైగా పని దినాలు
- ఏడాదిలో ఉపాధి కోసం రూ.497 కోట్లకు పైగా వ్యయం
- సగటు పనిదినాలు పెరగడంతో భారీగా తగ్గిన వలసలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉపాధి హామీ పనుల కల్పనలో ఉమ్మడి జిల్లా రికార్డు సృష్టించింది. కనీవినీ ఎరుగని రీతిలో కూలీలకు 'ఉపాధి' కల్పించిన ఘనతను సొంతం చేసుకుంది. గడిచిన నాలుగేళ్లలో జిల్లా చరిత్రలో గరిష్ట వర్షపాతం నమోదైంది. ఇబ్బడిముబ్బడిగా వ్యవసాయ పనులు వచ్చాయి. కానీ ఈ ఏడాది సగటు కంటే వర్షపాతం తక్కువ నమోదైంది. ఇలాంటి సందర్భాల్లో ఇతర నగరాలకు కూలీలు వలస వెళ్లకుండా సకాలంలో పని కల్పించగలిగారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో గడిచిన పది మాసాల్లో ఉపాధి హామీ కింద రమారమి రూ.500 కోట్లు వెచ్చించారు. ఇది చరిత్రలో రికార్డు వ్యయంగా చెప్పుకోవచ్చు.

సగటున 49 రోజుల పని

అనంతపురం జిల్లాలో ఒక్కో కుటుంబానికి సగటున 49 రోజుల పని కల్పించారు. అంతేకాదు 100 రోజుల పని పొందిన కుటుంబాలు 15 వేల కుటుంబాలు ఉన్నాయి. ఈ ఒక్క జిల్లాలోనే ఉపాధిలో భాగంగా రూ.349.15 కోట్లు వెచ్చించారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలోనూ సగటున ఒక్కో కుటుంబానికి 46.77 రోజుల పని కల్పించారు. వంద రోజులు పని 9,231 కుటుంబాలు పొందాయి. ఈ జిల్లాలోనూ రూ.148.14 కోట్ల వ్యయం చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో అత్యధికంగా పుట్టపర్తి నియోజకవర్గంలో 42వేల మందికి పైగా కూలీలు ఉపాధి పొందగా, అనంతపురం జిల్లాలో అత్యధికంగా ఉరవకొండ నియోజకవర్గంలో 75వేల మంది పైచిలుకు కూలీలు ఉపాధి హామీ ద్వారా లబ్ధి పొందారు.

వలసల నియంత్రణ

అనంతపురం జిల్లా అంటేనే ఉపాధి కోసం జనం వలసలు పోయేవారు. 2014-19 మధ్య కాలంలో వర్షాభావంతో వ్యవసాయ పనులు లేక కర్ణాటకకు భారీగా కూలీలు వలస వెళ్లారు. ఇప్పుడు వలసలు గరిష్టంగా 80 శాతం తగ్గినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఉరవకొండ, మడకశిర, గుంతకల్లు తదితర నియోజకవర్గాల నుంచి ఉపాధి కూలీలు భారీగా వెళ్లే పరిస్థితి ఉండేది. ఇప్పుడది పూర్తిగా నియంత్రణలోకి వచ్చింది. దీంతో పాటు రెండు జిల్లాల్లోనూ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ) భారీగా ఏర్పాటు చేయడంతో స్థానికంగానే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

అనంతపురం జిల్లాలో ఉపాధి పనులు..	
మొత్తం జాబ్ కార్డులు	2,59,919
కార్డుల్లో నమోదైన కూలీలు	4,63,234
ఉపాధి పొందిన కూలీలు	3,22,921
ఖర్చు చేసిన వ్యయం	రూ.349.15 కోట్లు
మొత్తం పని దినాలు	92,95,062
సగటున కుటుంబానికి పనులు	49.06 రోజులు

శ్రీసత్యసాయి జిల్లాలో ఉపాధి పనులు..	
మొత్తం జాబ్ కార్డులు	2,68,338
కార్డుల్లో నమోదైన కూలీలు	4,91,578
ఉపాధి పొందిన కూలీలు	2,35,751
ఖర్చు చేసిన వ్యయం	రూ.148.14 కోట్లు
మొత్తం పని దినాలు	65,81,080
సగటున కుటుంబానికి పనులు	46.77 రోజులు

'ఉపాధి'తోనే జీవనం



మా ఇంట్లో నలుగురు ఉంటాం. ఉపాధి హామీ పథకం కింద ఇప్పటికే 100 రోజులకు గాను 80 పని దినాలు పూర్తి చేశాం. ప్రభుత్వం మళ్లీ అదనంగా 50 పనిదినాలు పెంచింది. ఊరిలోనే పని చేసుకుంటూ సాఫీగా జీవనం సాగిస్తున్నాం. ఈ పథకం లేకపోయి ఉంటే పనుల కోసం ఇబ్బంది పడేవాళ్లం.

– వెంకటేశులు, కూలీ, ఒంటారెడ్డిపల్లి, కంబదూరు మండలం

పనిదినాల పెంపు చాలా సంతోషం



నేను, నా భార్య అరుణ ఇద్దరం ఉపాధి పనులకు వెళ్తాం. ఇప్పటికే మా జాబ్ కార్డు మీద 100 రోజులు పని చేశాం. రోజుకు రూ.220 కూలి వస్తుంది. ప్రభుత్వం మళ్లీ 50 రోజులు పని దినాలు కల్పించింది. చాలా సంతోషం. ఉపాధి హామీ పథకం కింద ఏటా 200 రోజులు పనులు చూపే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– గోపీ, ఉపాధి హామీ కూలీ, కుర్లపల్లి, కళ్యాణదుర్గం మండలం

క్లుప్తంగా

జిల్లాకు చేరుకున్న 1,251 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: రబీలో రైతులకు అవసరమైన ఎరువులు జిల్లాకు చేరుకున్నట్లు వ్యవసాయశాఖ ఏడీ రవి తెలిపారు. బుధవారం 1,251 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందాయన్నారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ చేరుకున్న ఆర్‌ఎస్‌ఎఫ్ కంపెనీకి చెందిన 10-26-26 రకం కాంప్లెక్స్‌లను ఆయన పరిశీలించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు తొలుత ఆర్‌బీకేలు, సొసైటీలకు అందజేసిన తర్వాత మిగులు ఎరువులను ప్రైవేటు హోల్‌సేల్ డీలర్లకు అందజేస్తామని వివరించారు.

యోగా టీచర్‌పై పోక్సో కేసు నమోదు

గుత్తి రూరల్: మండలంలోని ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పల్లపోతుల అనిల్‌కుమార్‌రెడ్డిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వివరాలు... వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌రెడ్డి కొంత కాలంగా గుత్తి మండలంలోని ఓ జెడ్పీహెచ్‌ఎస్‌లో యోగా టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బుద్ధ యోగా సొసైటీ పరిధిలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఆయన గత డిసెంబర్ 25న తాను పనిచేస్తున్న పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినిని మాయమాటలతో లోబర్చుకుని పిలుచుకెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లోని ఐదు తులాల బంగారు నగలతో పాటు ఆమె వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు... ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనిల్‌కుమార్‌రెడ్డి ఉన్న ప్రాంతాన్ని పసిగట్టి మంగళవారం రాత్రి అక్కడకు చేరుకుని ఇద్దరినీ పిలుచుకుని గుత్తికి వచ్చారు. విచారణ అనంతరం బుధవారం రాత్రి బాధితురాలి ఫిర్యాదు మేరకు అనిల్‌కుమార్‌రెడ్డిపై కిడ్నాప్, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. కాగా, సదరు యోగా టీచర్‌పై వైఎస్సార్ జిల్లాలోనూ పోక్సో కేసుతో పాటు మరో రెండు కేసులు ఉన్నట్లు సమాచారం.

భోజనం.. రుచికరం

- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై సర్వత్రా హర్షం
- సరిగా లేదంటూ 'ఈనాడు'లో అసత్య కథనం
- భోజనం రుచికరంగా ఉందంటున్న విద్యార్థులు
- మెనూ పక్కాగా అమలు చేస్తున్నామంటున్న ఉపాధ్యాయులు

ఫ్యాక్ట్ చెక్



అనంతపురంలోని కేఎస్‌ఆర్ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: సోమవారం నుంచి శుక్రవారం వరకూ రోజూ గుడ్డు... రోజుకో రకమైన రుచికరమైన వంట... శనివారం స్వీట్ పొంగల్.. మొత్తానికి ఆరు రోజులూ.. నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలతో కూడిన వంటకాలే! వీటికితోడు రోజూ రుచికరమైన రాగిజావ, మూడు రోజులు చిక్కీ... ఇదీ ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న 'జగనన్న గోరుముద్ద'. నిరుపేదలు, మధ్య తరగతి పిల్లలు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని జగన్ ప్రభుత్వం అందజేస్తుంటే... ఈనాడు రామోజీరావుకు కడుపులో మంట పుట్టినట్టుంది. ప్రభుత్వంపై అక్కసుతో తన పత్రికలో విషం చిమ్మేలా అసత్య కథనాన్ని ప్రచురింపజేశారు. వాస్తవాలను కప్పి పుచ్చి ప్రచురించిన కథనంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఏదైనా ఒక్క రోజూ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తే అసలు విషయం తెలుస్తుందని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులూ అంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బ్రహ్మాండమైన మెనూని ప్రభుత్వ ఆదేశాల మేరకు పక్కాగా అమలు చేస్తున్నామంటూ ఉపాధ్యాయులూ సగర్వంగా అంటున్నారు.

కనిపించని మిగులు...

టీడీపీ హయాంలో మధ్యాహ్న భోజనం తినలేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు. చాలీచాలని వంటకాలతో అర్ధాకలితో విద్యార్థులు అలమటించారు. అంతేకాక భోజనంలో నాణ్యత లోపించడంతో విద్యార్థులు తినలేక ప్లేట్లలోని అన్నం, నీళ్ల పప్పు తీసుకెళ్లి చెత్త కుప్ప పాలు చేసేవారు. జగన్ సర్కార్ ఏర్పాటైన తర్వాత మధ్యాహ్న భోజన మెనులో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. ఏజెన్సీ నిర్వాహకుల అవసరాలు ఎప్పటికప్పుడు తీరుస్తుండడంతో వారు సైతం నాణ్యత విషయంలో రాజీ పడకుండా తాజా కాయగూరలతో రుచికరమైన వంటకాలు సిద్ధం చేస్తున్నారు. దీంతో జిల్లాలోని ఆయా పాఠశాలల్లోని 92 శాతం మంది విద్యార్థులు జగనన్న గోరుముద్దను ఎంతో ఇష్టంగా తింటున్నారు. అన్నం వృథా కానివ్వడం లేదు. మిగులు అనేది లేకుండా సంతృప్తిగా విద్యార్థులు భోజనం చేస్తున్నారు.

తప్పిదాలకు తావులేదు

తరచూ ఇంట్లో సిద్ధం చేసుకునే వంటకాల్లోనే అప్పుడప్పుడు ఉప్పో... కారమో ఎక్కువ పడుతుండడం సహజం. అలాంటిది వందలాది మందికి భోజనం సిద్ధం చేసేటప్పుడు ఎప్పుడో ఒకసారి చిన్నపాటి తప్పిదం చోటు చేసుకోవడమూ అంతే సహజం. అయితే ఈ అంశాన్ని పట్టుకుని రోజూ ఇలాగే ఉంటోందని తప్పుడు కథనాలు ప్రచురించడంపై మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాము చేస్తున్న వంటకాల్లో ఎన్నటికీ తప్పిదాలకు తావివ్వడం లేదని అంటున్నారు. కేవలం విద్యార్థులే కాకుండా తాము కూడా అదే భోజనాన్ని తింటున్నామని, కొన్నిసార్లు ఉపాధ్యాయులు సైతం భోజనం అడిగి పెట్టించుకుని మరీ తింటున్నారని పేర్కొన్నారు. తప్పుడు కథనాలు ప్రచురిస్తే నమ్మేందుకు ప్రజలు పిచ్చి వాళ్లు కాదనే విషయాన్ని ఈనాడు యాజమాన్యం గుర్తించాలని హితవు పలికారు.

జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు	1,999
ప్రాథమికోన్నత పాఠశాలలు	202
ఉన్నత పాఠశాలలు	263
మొత్తం పాఠశాలలు	1,694
ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య	72,274
ప్రాథమికోన్నత పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య	61,264
ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య	38,539
మొత్తం విద్యార్థులు	1,99,912
భోజనం చార్జీలు ఇలా...	
టీడీపీ హయాంలో...	
1-5 తరగతుల ఒక్కో విద్యార్థికి	రూ.4.13
6-10 తరగతుల ఒక్కో విద్యార్థికి	రూ.6.18
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..	
1-5 తరగతుల ఒక్కో విద్యార్థికి	రూ. 5.88
6-10 తరగతుల ఒక్కో విద్యార్థికి	రూ. 8.57

ఇంటి భోజనం చేసినట్లు ఉంటుంది



మా స్కూల్‌లో మధ్యాహ్న భోజనం చాలా రుచిగా ఉంటుంది. ఇంట్లో తిన్నట్టే ఉంటుంది. రోజుకో రకం వంట పెడుతున్నారు. ఐదు రోజులు ఉడికించిన కోడిగుడ్డు ఇస్తారు. ఒక రోజు స్వీటు ఇస్తారు. రాగిజావ చాలా రుచిగా ఉంది. మా ఇంట్లో అయితే నేను ఎప్పుడూ రాగిజావ తాగలేదు.

– ఎస్.హాసిని, ఎం.చంద్రక్క పదో తరగతి, కేఎస్‌ఆర్ బాలికల పాఠశాల, అనంతపురం

రాగిజావ చాలా బాగుంది



రాగిజావ చాలా టేస్టీగా ఉంటుంది. నేనైతే ఒక గ్లాసు నిండా తాగుతా. మధ్యాహ్న భోజనం కూడా చాలా రుచిగా ఉంటుంది. గతంలో భోజనం రుచిగా లేదని పడేసేవాళ్లం. ఇంటి నుంచి తెచ్చుకునేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. అన్నం వృథా చేయకుండా మొత్తం తినేస్తున్నాం. మా క్లాస్‌లో అందరమూ రోజూ జగనన్న గోరుముద్ద భోజనమే తింటున్నాం.

– బి.మహాలక్ష్మి, పదో తరగతి, కేఎస్‌ఆర్ బాలికల పాఠశాల

చాలా తృప్తిగా తింటున్నారు



'జగనన్న గోరుముద్ద' చాలా రుచిగా ఉంటోంది. పిల్లలు తృప్తిగా తింటున్నారు. గతంలో రుచి లేక చాలా సార్లు విద్యార్థులు అన్నం పడేసేవాళ్లు. మేము నచ్చచెప్పి చూశాం. భోజనం రుచిగా లేదని, నీళ్ల పప్పు బాగుండడం లేదని అనేవాళ్లు. ఇప్పుడా పరిస్థితి లేదు. స్కూల్‌కు రోజూ 1,250 నుంచి 1,300 మంది విద్యార్థినులు వస్తే వారిలో 1,050 మందికి పైగా ఇక్కడ సిద్ధం చేసే వంటకాలనే ఎంతో ఇష్టంగా తింటున్నారు.

– జి.నారాయణ హెచ్‌ఎం, కేఎస్‌ఆర్ బాలికల పాఠశాల

యువకుడి హత్య



ఆరీఫ్ ఖాద్రీ (ఫైల్)

తాడిపత్రి అర్బన్: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఎదుట ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి పట్టణానికి చెందిన సయ్యద్ ఆరీఫ్ ఖాద్రీ (29) బుధవారం సాయంత్రం 6.45 గంటలకు తన మిత్రుడితో కలసి బాలికల ఉన్నత పాఠశాల ఎదుట మాట్లాడుకుంటుండగా గుర్తు తెలియని వ్యక్తులు అక్కడకు చేరుకుని గొడవపడ్డారు. ఆ సమయంలో మాటామాట పెరిగి వేటకొడవళ్లతో దాడి చేయడంతో ఆరీఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ గంగయ్య, ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, హతుడు 2022లో తాడిపత్రిలోని ఆస్పత్రి పాలెంలో ఇంటి బయట నిద్రిస్తున్న మహిళలపై పెట్రోల్ పోసి నిప్పటించిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

10వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు

- డ్వామా పీడీ వేణుగోపాలరెడ్డి

అనంతపురం టౌన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 10 వేల ఎకరాల్లో డ్రైల్యాండ్ హార్టికల్చర్‌ను అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఐదు ఎకరాల్లోపు మెట్ట భూములున్న రైతుల పొలాల్లో పండ్ల మొక్కల సాగును ప్రోత్సహించనున్నట్లు వివరించారు. ఈ ఏడాది 5వేల ఎకరాల్లో పండ్ల మొక్కల సాగుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఉపాధి కూలీలకు సైతం 1.45 లక్షల పనిదినాల కల్పనే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. అలాగే అమృత్ సరోవర్ పథకం కింద చెరువుల అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 100 చెరువులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు.

'దుర్గం' మనదే!

- సమన్వయంతో పనిచేసి వైఎస్సార్‌సీపీని గెలిపిద్దాం
- కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య



మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: రాబోవు ఎన్నికల్లోనూ కళ్యాణదుర్గంపై వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడించాలని ఆ పార్టీ సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. పార్టీ అధిష్టానం ఆయనను సమన్వయకర్తగా ప్రకటించిన తర్వాత తొలిసారిగా బుధవారం ఆయన కళ్యాణదుర్గం వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో రంగయ్య మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను అందరినీ సమన్వయం చేసుకుంటూ సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా హోదాలు మరిచి ప్రతి ఒక్కరూ పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ కళ్యాణదుర్గాన్ని చేజార్చుకోబోమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే కీలకమన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించినప్పుడే నాయకుడికి సరైన గుర్తింపు వస్తుందన్నారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తనతో సంప్రదించాలన్నారు. అనంతరం పార్టీ నాయకులు ఎంపీ తలారి రంగయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, జెడ్పీటీసీలు బొమ్మన్న, మంజునాథ్, తాలూకా వాల్మీకి సంఘం అధ్యక్షుడు ములకనూరు గోవిందు, నాయకులు తలారి వెంకటేశులు, చందన శివాజీ, దొడగట్ట కిష్టప్ప, శ్రీకాంత్‌రెడ్డి, రాజు, గొల్ల సూరి, డాక్టర్ బొమ్మయ్య, ఎంఎస్ రాయుడు, దొడ్ఘో తిప్పేస్వామి, కోళకుర్తి జయరామిరెడ్డి, ఆంజనేయులు, రేవన్న, కామక్కపల్లి మల్లి, పాపంపల్లి రమేష్, టైలర్ శీను, భాస్కర్‌రెడ్డి, హులికల్లు తిమ్మప్ప, వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటేశులు, న్యాయవాదులు దేవేంద్ర, దాదాఖలందర్, భీమప్ప, ఫయాజ్, ప్రతాప్, లక్ష్మన్న, యేసేపు, పిల్లలపల్లి అంజి, ఇబ్రహీం, మల్లికార్జున, దొడగట్ట సూరి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో పెరిగిన సేవలు

అనంతపురం మెడికల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన వస్తోంది. బుధవారం అనంతపురం, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి ప్రాంతాల్లోని 8 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. 3,332 మందికి స్పెషలిస్టు వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు ఓపీ సేవలందించారు. వీరిలో పురుషులు 1,589 మంది, మహిళలు 1,783 మంది ఉన్నారు. దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న 14 మందిని జిల్లా ఆస్పత్రి, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు.

మెరుగైన సేవలందించాలి

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి అన్నారు. అనంతపురంలోని బుడ్డప్పనగర్‌లో ఉన్న వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరితో ఓపిగ్గా మాట్లాడి సమస్య తెలుసుకుని చికిత్స అందజేయాలన్నారు. అత్యవసర కేసులను సంబంధిత ఆస్పత్రులకు రెఫర్ చేయాలన్నారు.

ప్రెస్సింగ్ మిషన్ కిందపడి కార్మికుడి మృతి

తాడిపత్రి: మండలంలోని రావివెంకటాంపల్లి వద్ద ఉన్న భైరవ బ్రిక్స్ పరిశ్రమలో ప్రెస్సింగ్ మిషన్ కిందపడి ఓ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... భైరవ బ్రిక్స్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న రావివెంకటాంపల్లి నివాసి నరేష్ (18)కు తండ్రి లేడు. తల్లి లక్ష్మీదేవి, తమ్ముడితో కలసి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం పనిలోకి వెళ్లిన నరేష్... ప్రెస్సింగ్ మిషన్ కింద శుభ్రం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా మిషన్ రన్ అయింది. బయట పడలేని పరిస్థితిలో మిషన్ కింద చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే మిషన్ ఆపరేటర్ నిర్లక్ష్యమే ఇందుకు కారణంగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. సమాచారం అందుకున్న తాడిపత్రి రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

నేడు రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ క్రీడోత్సవాలు

అనంతపురం: పాలిటెక్నిక్ కళాశాలల రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు గురువారం అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు క్రీడోత్సవ నిర్వహణ కమిటీ చైర్మన్, అనంతపురం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన క్రీడాజట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు.

అనారోగ్యంతో సీనియర్ అసిస్టెంట్ నీలకంఠారెడ్డి మృతి



నీలకంఠారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గం టౌన్: స్థానిక మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నీలకంఠారెడ్డి బుధవారం మృతి చెందారు. దాదాపు ఐదేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి బుధవారం ఉదయం స్వస్థలమైన గుంతకల్లులో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలియగానే మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నీలకంఠారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నీలకంఠారెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌని లావణ్య, పద్మజ, శారదమ్మ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, రామాంజనేయులు, నిజాముద్దీన్, గౌని శ్రీరామిరెడ్డి, మేనేజర్ ప్రసాద్, టీపీఓ మారుతీప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కిశోర్, అకౌంటెంట్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

నార్పల: స్నేహితులు గేలి చేయడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు... నార్పల మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని స్థానిక కేజీబీవీలో 9వ తరగతి చదువుతోంది. బుధవారం స్నేహితులందరూ కలుసుకుని మాట్లాడుకుంటూ సదరు విద్యార్థినిని ఆటపట్టిస్తూ గేలి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె విషపూరిత ద్రావకం తాగింది. విషయాన్ని వెంటనే స్నేహితులు ఉపాధ్యాయులకు చేరవేయడంతో 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఆమె పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు సమాచారం. కాగా, ఘటనపై కేజీబీవీ ఎస్‌ఓ నిర్మల, ఎంఈఓ కృష్ణయ్య మాట్లాడుతూ.. సాయంత్రం ఆట విడుపు సమయంలో స్నేహితులు సరదాగా మాట్లాడుకుంటూ గడిపారని, ఆ సమయంలో తనను ఆటపట్టించడంతో మనస్తాపం చెందిన విద్యార్థిని అఘాయిత్యానికి పాల్పడిందన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు.